సాక్షి
వికారాబాద్
సోమవారం, 24, జూలై, 2023



భయం భయంగా..

యాలాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి.

8లో▸

న్యూస్‌రీల్

మణిపూర్ ఘటన ఉన్మాదులను ఉరితీయాలి



కొడంగల్ పట్టణంలో నాయకుల నిరసన

కొడంగల్ రూరల్: మణిపూర్‌లో జరిగిన సంఘటనలో ఉన్మాదులను ఉరితీయాలని పలు సంఘాలు, పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ హింసలో ఆదివాసి మహిళల్ని ఉన్మాదులకు అప్పగించిన పోలీసులను డిస్మిస్ చేయాలన్నారు. ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. సీఎం బీరేం ద్రసింగ్ వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. ప్రసంగించిన వారిలో అంబేడ్కర్ చౌరస్తాలో యువజన సంఘం నాయకుడు యూ.రమేశ్‌బాబు, ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్, డీవీఎంసీ జిల్లా మెంబర్ కె.దస్తప్ప, స్వేరో జిల్లా అధికార ప్రతినిధి ఎరన్‌పల్లి శ్రీనివాస్, ఏవైఎస్ టౌన్ ప్రెసిడెంట్ కె.చంద్రశేఖర్ ఉన్నారు. అలాగే కళాకారులు బాలు గౌరీగళ్ల కృష్ణ, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పత్రీజీ సంస్మరణోత్సవాలు ప్రారంభం



మహేశ్వర మహా పిరమిడ్‌కు చేరుకుంటున్న ధ్యానులు

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్‌లో ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ స్మృతి స్మరణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పత్రీజీ తుదిశ్వాస విడిచి ఏడాది పూర్తి కావడంతో ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో ధ్యానులు మహేశ్వర మహాపిరమిడ్ చేరుకుంటున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని సోమ, మంగళ వారాల్లో పిరమిడ్ ఆవరణలో ప్రత్యేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఓయూ న్యాయశాస్త్రం కోర్సుల పరీక్షల తేదీల వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఆగస్టు 3 నుంచి ప్రారంభం కానున్న వివిధ న్యాయశాస్త్రం కోర్సుల సెమిస్టర్ పరీక్షల తేదీలను వెల్లడించారు. ఎల్‌ఎల్‌బీ, బీఏ ఎల్‌ఎల్‌బీ, బీకాం ఎల్‌ఎల్‌బీ, బీబీఏ (3, 5 సంవత్సరాలు) కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పోస్టుల సెమిస్టర్ పరీక్షల వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లో చూడొచ్చు.

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ప్రజా సంఘాల నేతల డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: మణిపూర్ మారణహోమానికి పూర్తి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలని వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదివారం పట్టణంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మణిపూర్‌లో కొన్ని నెలలుగా భారతావని సిగ్గుతో తలదించుకునే ఘటనలు చోటు చేసుకుంటున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రధాని ప్రారంభ దశలోనే స్పందించి ఉంటే ఇంతటి దారుణాలు జరిగేవి కావన్నారు. వెంటనే సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు నర్సింలుగౌడ్, శ్రీను నాయక్, ఈశ్వర్ నాయక్, వెంకటరమణ, రజాక్, కుర్మయ్య, శివ, శ్రీకాంత్, కృష్ణయ్య, సత్యం, శ్యామల, కృష్ణ, రవికుమార్, నర్సింలు, అర్జునప్ప, టీజీ శ్రీనివాస్, చంద్రమౌళి, రాజు పాల్గొన్నారు.

● లక్నాపూర్‌కు జలకళ



పరిగి మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది. విస్తారంగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి 5 అడుగుల మేర నీరు చేరింది. మరో మూడు అడుగుల నీరు చేరితే అలుగు పారుతుంది. ఈ ప్రాజెక్టు కింద వందల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. – పరిగి

వర్షార్పణం

ఐదు రోజులుగా విశ్వరూపం చూపించిన వరుణుడు ఎట్టకేలకు కాస్త శాంతించాడు. వర్షాలు తగ్గుముఖం పట్టినా వాగులు, వంకలు ఉరకలెత్తుతున్నాయి. వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. వాహనదారులకు నరకాన్ని తలపిస్తున్నాయి. అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. బ్రిడ్జీలు కూలిపోయాయి. భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేయడమేకాక అపార నష్టాన్ని కలిగించాయి.

పంటలు వరదపాలు

- ప్రధాన రహదారులన్నీ ధ్వంసం
- వాహనదారులకు నరకం
- వందల సంఖ్యలో కూలిన ఇళ్లు
- నష్టం జరగలేదంటున్న అధికారులు



ధ్వంసమైన వికారాబాద్- సదాశివపేట రహదారి



దారూరు మండలంలో నీటమునిగిన పంటలు

వికారాబాద్: జిల్లాలో వర్షాకాలం ఆరంభం నుంచి అరకొరగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గడిచిన ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురవడంతో పంటలకు నష్టం కూడా అదే స్థాయిలో జరిగింది. మూసీ, కాగ్నా పరీవాహక ప్రాంతాల్లో అనేక చోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. నవాబుపేట మండల పరిధిలోని చించల్‌పేట, చిట్టిగిద్ద, అత్తాపూర్, అక్నాపూర్, నారేగూడ, గంగ్యాడ, వికారాబాద్ మండల పరిధిలోని మద్గుల్ చిట్టెపల్లి, దారూరు మండల పరిధిలో కాగ్నా నది, అందులో కలిసే వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. ఇంకొన్ని చోట్లా ఏకంగా కొట్టుకుపోయాయి. వందల ఎకరాల్లో పత్తి, జొన్న, టమాటా, మిర్చి తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కళ్లెదుటే వందల ఎకరాల్లో పంటలు నష్టపోయినా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం జిల్లాలో ఎలాంటి పంట నష్టం జరగలేదని పేర్కొంటుండటం గమనార్హం. గతంలో రెండు మూడు పర్యాయాలు వర్షాలకు పాడైన పంటలకు సంబంధించి సర్వేలు చేసి ప్రభుత్వానికి పంపినా పరిహారం రాకపోవడంతో నష్టం అంచనా విషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అడుగడుగునా గుంతలే..

జిల్లాలో పలు చోట్ల రహదారులు ధ్వంసమయ్యాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు అడుగడుగునా గుంతలమయంగా మారాయి. వికారాబాద్- తాండూరు. తాండూరు- కొడంగల్, వికారాబాద్-శంకర్‌పల్లి, వికారాబాద్-సదాశివాపేట, వికారాబాద్- పరిగి, పరిగి- షాద్‌నగర్, పరిగి-మిట్టకోడూరు, తాండూరు-బషీరాబాద్ తదితర ప్రధాన రహదారులు ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. వీటితో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల్లో అనేక లింక్ రోడ్లు ధ్వంసమయ్యాయి. అయితే రోడ్లకు మరమ్మతులు చేయించే విషయంలో, నష్టాన్ని అంచనా వేసే విషయంలో అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు.

వంతెనలు లేక అవస్థలు..

- పరిగి నుంచి వికారాబాద్ వెళ్లే దారిలో వంతెనను తక్కువ ఎత్తులో నిర్మించారు. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా వంతెనపైనుంచి వరద పొంగి పొర్లుతుంది. ఫలితంగా గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- కొడంగల్ మండల కేంద్రం నుంచి పోచమ్మ తండా, మైసమ్మ తండాలకు వెళ్లే దారిలో ఉన్న వాగుపై వంతెనలేదు. దీంతో వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో 15 కిలోమీటర్లు అదనంగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. లేదంటే వాగులోంచే ఈదుకుంటూ ప్రమాదకర స్థితిలో వెళ్లాల్సి వస్తుంది.
- ధారూరు మండలం నాగసముందర్, దోర్నాల్, మంచన్‌పల్లి గ్రామాల సమీపంలో వంతెనలు లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి ప్రయాణికులకు తిప్పలు తప్పడంలేదు.
- దారూరు మండలం దోర్నాల్ బ్రిడ్జి పనులు ఏళ్ల తరబడి కొనసాగుతుండటంతో ఏటా వర్షాకాలంలో రాకపోకలు స్తంభిస్తున్నాయి.



కోట్‌పల్లి ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో చేరుతున్న నీరు

కోట్‌పల్లిలో జలం.. రైతన్నకు బలం

- నిండుకుండలా ప్రాజెక్టు
- 23 అడుగులకు చేరిన నీరు
- తూములు, కట్టలకు మరమ్మతులు జరిగేనా?

ధారూరు: జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో జలకళను సంతరించుకుంది. ఆదివారం నాటికి ప్రాజెక్టులో 23 అడుగుల మేర నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 24 అడుగులు. ప్రస్తుతం నాలుగు వాగుల ద్వారా వస్తున్న వరద ప్రాజెక్టులోకి చేరుతోంది. సోమవారం నాటికి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉందని ఇరిగేషన్‌శాఖ తాండూరు డీఈ భాస్కర్ తెలిపారు. ఎప్పుడూ యాసంగి పంటలకే నీరు వదిలే అధికారులు ఈసారి వానాకాలం పంటలకు సైతం నీటిని వదిలే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో పూడిక తీయకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. మధ్యతరహా ప్రాజెక్టు అయినా పాలకులు దృష్టిసారించడంలేదని, తూములు, కట్ట, అలుగు వద్ద మరమ్మతులు చేపట్టాలని దశాబ్ద కాలం నుంచి కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం తెలిపారు. దక్షిణ తెలంగాణలోని ప్రాజెక్టులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని వారు అంటున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తే పూర్తి ఆయకట్టుకు నీరందుతుందని రైతులు చెబుతున్నారు.

ఈసారైనా చేప చేతికి చిక్కేనా?

కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలోంచి ఏ ఒక్క చేప బయటకు వెళ్లకుండా సాగునీటి సంఘం సభ్యులు ఆదివారం అలుగుకు అడ్డంగా కర్రలను పాతి వలలను ఏర్పాటు చేశారు. గత ఏడాది ఇలాగే వలలను ఏర్పాటు చేసినా భారీ వరద ఉధృతికి వలలన్నీ కొట్టుకుపోయాయి. దీంతో చేపలన్నీ బయటకు వెళ్లడంతో భారీ నష్టం ఏర్పడింది. ఈసారి పకడ్బందీ చర్యలు చేపట్టారు.

మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటాం



పరిగిలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల నిరసన

- పంచాయతీ కార్మికుల స్పష్టీకరణ
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- 18వ రోజుకు చేరిన సమ్మె

పరిగి: పంచాయతీ కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించుకుంటోందని, సమస్యలను పరిష్కరించకపోతే మంత్రులను, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని కార్మిక సంఘ నాయకులు స్పష్టం చేశారు. కార్మికుల సమ్మె ఆదివారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పలువురు కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.19,500కు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామాలు శుభ్రంగా ఉంటున్నాయంటే కార్మికుల శ్రమవల్లేనని అన్నారు. ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే అన్ని వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఏం జరుగుతోంది?

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడి ఇంటికి ఎమ్మెల్యే ఆనంద్

- అరగంట పాటు మంతనాలు
- జిల్లాలో జోరుగా చర్చ
- రసవత్తరంగా రాజకీయాలు

వికారాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికలకు సుమారు నాలుగు నెలల సమయం ఉన్నప్పటికీ వికారాబాద్‌లో అప్పుడే రాజకీయ వేడి నెలకొంది. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనడానికి ఆదివారం నాటి సంఘటనే నిదర్శనం. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదివారం ఉదయం ఒంటరిగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. సుమారు అరగంట పాటు మంతనాలు కొనసాగాయి. దీంతో సుధాకర్ రెడ్డి పార్టీ మారుతున్నారా? అనే విషయం సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. ఎమ్మెల్యే ఆనంద్ సుధాకర్ రెడ్డి నివాసానికి ఒంటరిగా వెళ్లిన ఫొటో వాట్సాప్‌లలో చక్కర్లు కొట్టింది. దీంతో పట్టణంలో రోజంతా ఇదే చర్చ జరిగింది. ఇటీవలి కాలంలో కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు ఎమ్మెల్యే నిధులు ఇవ్వడం లేదని పలు మార్లు ఆరోపించారు. సుధాకర్ రెడ్డి సొంత వార్డు బీటీఎస్‌లో ఎమ్మెల్యే మీతో నేను కార్యక్రమం నిర్వహించే క్రమంలో సుధాకర్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ విషయంపై కూడా సుధాకర్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఇలా ఒకటి తరువాత ఒకటి చోటుచేసుకుంటున్న తరుణంలో ఎమ్మెల్యే సుధాకర్ రెడ్డి నివాసానికి ఎందుకు వెళ్లారనే దానిపై ఇరు పార్టీల నాయకుల్లో అనుమానం రేకెత్తింది. సుధాకర్‌రెడ్డి విమర్శలతో రాజకీయంగా కొంత నష్టం జరుగుతుందని, దాన్ని నివారించుకునే ఉద్దేశంతో ఎమ్మెల్యే వెళ్లినట్లు బీఆర్‌ఎస్ నాయకులు కొందరు చెబుతున్నారు. మనమంతా ఒకటేనని, ఇంకా 20 నుంచి 25 ఏళ్ల రాజకీయ జీవితం కొనసాగించాల్సిన వాళ్లమని, ఒకరికి ఒకరం సహకరించుకుందామని, నాకు కూడా సహకరించాలని ఎమ్మెల్యే సుధాకర్‌రెడ్డి దగ్గర ప్రస్తావించినట్లు సమాచారం. స్పందించిన సుధాకర్ రెడ్డి తాను ఎప్పటికీ కాంగ్రెస్ నాయకుడినేని, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ వెంటే ఉంటానని ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. ఎమ్మెల్యే రాజకీయ జిమ్మిక్కులో భాగంగానే తన నివాసానికి వచ్చినట్లు సుధాకర్ రెడ్డి తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు వినికిడి. ఏది ఏమైనా అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా అన్ని వర్గాలను, నాయకులను సంప్రదిస్తుండటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.



సుధాకర్‌రెడ్డి ఇంట్లోకి వెళ్తున్న ఎమ్మెల్యే ఆనంద్

చేతివృత్తులకు అండగా ఉంటాం

మంత్రి సబితారెడ్డి



మంఖాల్‌లో మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

తుక్కుగూడ: చేతివృత్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని మంఖాల్‌లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్కో కులానికి ఆత్మగౌరవ భవనాలను నిర్మించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. గౌడ కులస్తులకు రూ.5 లక్షల ప్రమాద బీమా, గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించి ఉపాధి కల్పించామన్నారు. దివ్యాంగులకు ఆగస్టు నుంచి రూ.3 వేల నుంచి రూ.4 వేల పింఛన్ అందజేయనున్నట్లు చెప్పారు. తుక్కుగూడ మున్సిపాలిటీకి ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంఖాల్‌లో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంఖాల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బకాయిలు భారం.. వసూలు కష్టం

- ప్రభుత్వ శాఖల నిర్వాకం.. మున్సిపల్‌కు శాపం
- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- కొడంగల్ మున్సిపల్ ఏర్పడి ఐదేళ్లు



కొడంగల్ పట్టణంలోని ఓ కాలనీ..

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ శాఖలు ఆస్తి పన్ను వసూలు కావడంలేదు. 15 ప్రభుత్వ శాఖలు రూ.6 లక్షలకుపైగా చెల్లించాల్సి ఉంది. కొడంగల్ మున్సిపల్ ఏర్పడి ఆగస్టు 2 తేదీ నాటికి ఐదేళ్లు పూర్తి అవుతాయి. కొన్ని ప్రభుత్వ శాఖలు కరెంటు బిల్లులు కూడా చెల్లించలేదు. ఈ మధ్య అటవీ శాఖ కార్యాలయానికి కరెంటు కనెక్షన్‌ను విద్యుత్ శాఖ తొలగించింది. వారం రోజుల పాటు ఫారెస్టు సిబ్బంది కరెంటు లేకుండానే కాలం గడిపారు. బిల్లుల చెల్లింపులో జాప్యంపై పలు శాఖల అధికారులు మాట్లాడుతూ ఆస్తి పన్నును, కరెంటు బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బిల్లులు పంపించినా జిల్లా ట్రెజరీ నుంచి డబ్బులు రావడం లేదని వాపోయారు.

ఆయా శాఖల ఆస్తి పన్ను..

అత్యధికంగా తహసీల్దార్ కార్యాలయం రూ.1,91,834, మండల పరిషత్ కార్యాలయం రూ.1,90,370, ట్రాన్స్‌కో అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీరు కార్యాలయం రూ.67,030, పంచాయతీరాజ్ డీఈఈ కార్యాలయం రూ.50,643, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం రూ.66,804, పోలీస్‌స్టేషన్ రూ.52,783, సీఐ ఆఫీస్ క్వార్టర్స్ రూ.23,875, మహిళా సమాఖ్య రూ.9505 ఉంది. కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ మాత్రం ఆస్తి పన్ను చెల్లించడంలో ముందుంది. ఆర్టీసీ అధికారులు సకాలంలో చెల్లిస్తున్నారు. ఒక్క రూపాయి కూడా బకాయి లేకుండా ఉన్న శాఖ ఒకటి ఉందంటే అది ఆర్టీసీ మాత్రమేనని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

ఆరు గ్రామాలను విలీనం చేస్తూ..

పట్టణాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 ఆగస్టులో కొడంగల్ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చారు. ఆరు గ్రామాలను విలీనం చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి, పాత కొడంగల్, గుండ్లకుంట గ్రామాల్లో పలు సమస్యలు స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అధికారులు గ్రామాల్లో పర్యటించి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల వరకు వచ్చే సరికి లక్షల్లో బకాయి ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఇంటింటి సర్వే నిర్వహించి..

మున్సిపల్ పరిధిలో మొత్తం 14,519 జనాభా ఉంది. ఇంటింటి సర్వే నిర్వహించి అనుమతులు లేని వాటిని, పన్నులు చెల్లించని ఇళ్లను గుర్తించారు. మున్సిపల్ పరిధిలో 4,346 ఇళ్లు ఉన్నాయి. అందులో 350 ఇండ్లను అసైన్‌మెంట్ చేయాల్సి ఉంది. 1189 ఇళ్ల యజమానులు పన్నులు చెల్లించడం లేదు. 519 ఇళ్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. మున్సిపల్‌లో ప్రతి నెలా సుమారు రూ.12 లక్షల ఖర్చు ఉంది. ఉద్యోగులు, సిబ్బంది జీతాల కోసం రూ.6లక్షలు, కరెంటు బిల్లు చెల్లింపు రూ.2లక్షలు, ఇతర పనుల నిర్వహణ కోసం రూ.4లక్షలు ప్రతి నెలా వెచ్చించాల్సి వస్తోంది. ఆదాయం మాత్రం నెలకు రూ.4లక్షలకు మించడం లేదు.

క్లుప్తంగా

జంగమ సమాజం తాలూకా అధ్యక్షుడిగా నటరాజ్



నూతన కార్యవర్గ సభ్యులు

పరిగి: జంగమ సమాజం పరిగి తాలూకా అధ్యక్షుడిగా నస్కల్ గ్రామానికి చెందిన నటరాజ్ స్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలో ఆ సమాజం జిల్లా కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో తాలూకా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నటరాజ్ స్వామి, ప్రధాన కార్యదర్శిగా జంగం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా కాశీనాథ్ స్వామి, కేతక లింగం, వినయ్, కోశాధికారిగా శివానంద స్వామి, సలహాదారులుగా గిరీశ్వర స్వామి, కార్యదర్శులుగా శ్రీశైలం, ఉమాశంకర్, భిక్షపతి, చంద్రమౌళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. జంగమ సమాజం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అనంతగిరికి పర్యాటకుల తాకిడి



అనంతగిరి గుట్టలో పర్యాటకుల సందడి

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని అనంతగిరి గుట్టకు ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. ఉదయం గుట్టకు చేరుకున్న పర్యాటకులు నంది ఘాట్ వద్ద నుంచి అడవిలోనికి వెళ్లారు. అక్కడ నీటి ప్రవాహం వద్ద ఎంజాయ్ చేశారు. సాయంత్రం వరకు సరదాగా గడిపి ఊళ్లకు బయలుదేరారు.

పబ్లిక్ స్పీకింగ్‌పై ప్రత్యేక శిబిరం

ఇబ్రహీంపట్నం: పబ్లిక్ స్పీకింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై స్పెషల్ ట్రైనింగ్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదావెంకట్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31న వినోభానగర్‌లోని సాధన కుటీర్‌లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు, రాజకీయ నాయకులకు, వివిధ వృత్తుల్లో ఉన్నవారికి ఉపయోగపడేలా ఈ ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 27లోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. కేవలం 50 మందికే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి రామకృష్ణ మఠం(హైదరాబాద్) స్వామి శితికంఠానంద మహరాజ్, రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి, రాణి రుద్రమదేవి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సామాజిక కార్యకర్త రాజేందర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు

కందుకూరు: వేగంగా వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం అర్ధరాత్రి ఆమనగల్లు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. కాగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను శ్రీశైలం హైవేపై ఏర్పాటు చేసిన వీధి దీపాల నిర్వహణ కోసం ఇటీవలే ఏర్పాటు చేశారు. కనెక్షన్ ఇచ్చి ఏబీ స్విచ్ ఆఫ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ కారు ఎవరిది? అందులో ఎంత మంది ప్రయాణిస్తున్నారనే సమాచారం ఇంకా తెలియరాలేదు.

భయంభయంగా చదువులు



ఇటీవల రేళ్లగడ్డ తండాలో వర్షానికి కూలిన పాఠశాల ముందు భాగం



బాణాపూర్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం

- శిథిలావస్థలో పాఠశాలల భవనాలు
- ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ఆందోళన
- ఇటీవల రేళ్లగడ్డ తండాలో కూలిన భవనం
- కొత్త భవనాలు నిర్మించాలని తల్లిదండ్రుల వినతి

యాలాల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు చోట్లా భవనాలు ఉరుస్తుండగా, రేళ్లగడ్డ తండాలో కూలిపోయింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని 10 ఉన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి ఆయా పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థులతో కలిపి సుమారు 6,500కు పైచిలుకు ఉన్నారు. చాలా గ్రామాల్లో పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు తల్లిదండ్రుల్లో మరింత ఆందోళన పెరుగుతోంది. ఏకధాటి వర్షం కారణంగా ఈ నెలా 5న రేళ్లగడ్డ తండాలోని పాఠశాల ముందు భాగం(సన్ సైడ్)కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చాలా గ్రామాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడం, ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఆందోళన కలిగిస్తోంది. మండలంలోని రేళ్లగడ్డ తండా, ముద్దాయిపేట, సంగెంకుర్దు, కిష్టాపూర్, తిమ్మాయిపల్లి, బాణాపూర్, బాగాయిపల్లి, అడాల్‌పూర్, రాఘవపూర్, తొప్పెర్లగడ్డ తండా, రాజీవ్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పాఠశాల గదులు ఆందోళన కలిగిస్తున్న వాటిలో ఉన్నాయి. వీటిలో చాలా వరకు చిన్నపాటి వర్షానికి గదంతా తడిసి ముద్దవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మన ఊరు మన బడిలో భాగంగా కొన్ని గ్రామాల్లో భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించగా, మెజారిటీ పాఠశాలలో సమస్య అలాగే ఉండిపోయింది. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి అవసరమైన చోట కొత్త భవనాలు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉరుస్తున్న పైకప్పు



గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే గదులు, పైకప్పు ఉరుస్తోంది. దీంతో విద్యార్థులు గదుల్లో కూర్చోలేని పరిస్థితి ఉంది. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించాం. మన ఊరు–మన బడిలో భాగంగా కొత్త భవనం మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలి.

– శేఖర్, సర్పంచ్, అడాల్‌పూర్

దశలవారీగా అభివృద్ధి



మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తున్నాం. ప్రస్తుతం రెండో విడత మన ఊరు–మన బడి కార్యక్రమం కొనసాగే అవకాశం ఉంది. ఆయా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థులను కూర్చోబెట్టడం లేదు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు ఆవశ్యకతను వివరిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ, యాలాల

ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేస్తాం

- బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నేత వెంకటేశ్వర్లు
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని బంపర్ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని కే వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలోని పలు పార్టీలకు చెందిన 70మందికి పైగా నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తీవ్రంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, నాయకులు గోవర్దన్‌చారి, సోమయాచారి, సాయిలు, జయప్ప, మహ్మద్ శేఖర్, వెంకటప్ప, మల్లమ్మ, నర్సమ్మ, జహంగీర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వాగులో గల్లంతైన వ్యక్తి విగతజీవిగా..

- రెండు రోజుల క్రితం వరదలో కొట్టుకుపోయిన పెంటప్ప
- చెరుకు పొలంలో మృతదేహం లభ్యం



పెంటప్ప మృతదేహం

తాండూరు రూరల్: రెండు రోజుల క్రితం వాగులో గల్లంతైన వ్యక్తి విగతజీవిగా కనిపించాడు. ఈ సంఘటన మండలంలోని సంగెంకలాన్ గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెంటప్ప(48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో సంగెంకలాన్ వాగు దాటుతుండగా కొట్టుకుపోయాడు. శనివారం పోలీస్, ఫైర్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ విభాగం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం మళ్లీ గాలించారు. చెరుకు పొలంలో పెంటప్ప మృతదేహంగా గుర్తించారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు బోరున విలపించారు. బాధిత కుటుంబానికి గ్రామ సర్పంచ్ మేఘనాథ్ గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు.

నిలువెత్తు నిర్లక్ష్యం..!

- అసంపూర్తిగా మోడల్ స్కూల్ హాస్టల్ భవన నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

బంట్వారం: పదేళ్ల క్రితం మోడల్ స్కూల్‌కు హాస్టల్ మంజూరైనా నేటికీ భవన నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 9నుంచి ఇంటర్ వరకు 650మంది విద్యార్థులు, విద్యార్థినులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో 2012లో అప్పటి ప్రభుత్వం హాస్టల్ భవన నిర్మాణానికి రూ. 1.28 కోట్లు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పునాది దశలో పనులు ఆపేశాడు. దీంతో అధికారులు రీ టెండర్ పిలిచారు. పనులను మరో కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో సదరు కాంట్రాక్టర్ కూడా ఏళ్ల తరబడి పనులు సాగించాడు. కానీ అసంపూర్తిగానే వదిలేశాడు. ఏడాది క్రితం ఫస్ట్ ఫ్లోర్ అందుబాటులోకి వచ్చినా ప్రారంభంకాలేదు.

ఇబ్బందుల్లో విద్యార్థినులు

బంట్వారం మోడల్ స్కూల్‌లో 650మంది విద్యార్థులు ఉండగా అందులో 180 మంది వరకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఇందులో చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారే. అయితే హాస్టల్ భవనం అందుబాటులోకి వస్తే దాదాపు వంద మంది ఇక్కడే ఉండి చదువుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం విద్యార్థినులు గ్రామాల నుంచి వచ్చి చదువుకొని ఇళ్లకు వెళుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



హాస్టల్ భవన నిర్మాణం పదేళ్లుగా పూర్తి కాలేదు. ఇప్పటికే ఇద్దరు కాంట్రాక్టర్లు మారారు. ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తా. హాస్టల్ వసతి లేకపోవడంతో బాలికలు అసౌకర్యానికి గురవుతున్నారు. రవాణా సదుపాయం లేని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

– చంద్రప్ప ఎంఈఓ

రీ టెండర్ కాల్ చేస్తాం

హాస్టల్ భవనాన్ని జీ ప్లస్ వన్ కట్టాలి. కానీ కాంట్రాక్టర్ పనులను మధ్యలో ఆపేశాడు. రీ టెండర్ వేసి సెకెండ్ ఫ్లోర్ కూడా పూర్తి చేస్తాం. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగిన మాట వాస్తవమే. ఈ సమస్యను జిల్లా అధికారులకు విన్నవించి సకాలంలో భవనం అందుబాటులోకి వచ్చేలా చూస్తాం.

– నరోత్తం, ఏఈ, ఈడబ్ల్యూఐడీసీ



అసంపూర్తిగా మోడల్ స్కూల్ హాస్టల్ భవనం

కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

- కంకర తేలి, పగుళ్లు ఏర్పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు



కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు వెళ్లడంతో దెబ్బతిన్న రోడ్డు

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి బీటీ రోడ్లు వేస్తుంటే వాటి నిర్వహణను మాత్రం అధికారులు గాలికి వదిలేస్తున్నారు. వేసిన రోడ్లు ఏడాది గడవక ముందే కంకర తేలి, పగుళ్లు ఏర్పడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల కారణంగానే రోడ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు అంటున్నారు. యాసంగి, వానాకాలంలో రెండు సీజన్లలో మండలంలోని ఆయా గ్రామాల్లో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు బీటీ రోడ్లపై నడిపిస్తుండడంతో కొన్ని నెలలకే రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి.

నిబంధనలకు పాతర

మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామాల్లో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు వెళ్లి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డుతో పాటు పరిగి మండలం గడిసింగపూర్ నుంచి గండీడ్ మండలం రంగారెడ్డిపల్లి వెళ్లి ప్రధాన రోడ్లు దోమ మండలంలో ఉన్నాయి. వీటిని అనుబంధంగా ఆయా గ్రామాలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి బీటీ రోడ్లను వేసింది. అయితే ప్రతి సీజన్‌లో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు పొలాలు దాటేందుకు రోడ్లపై నుంచి వెళ్తుండడంతో రోడ్లు పూర్తిగా కంకర తేలి, పగుళ్లు వచ్చి ధ్వంసమతవుతున్నాయి. కేజ్‌వీల్స్ పట్టీలు లేకుండా రోడ్లపై ప్రయాణించకూడదనే నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు శూన్యం

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు ప్రయాణిస్తుంటే సదరు ట్రాక్టర్ యాజమానిపై ఆర్అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేయాలి.. కానీ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు అలాంటి కేసులు ఒక్కటి కూడా నమోదవ్వలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కేజ్‌వీల్స్ వల్లే బీటీ రోడ్లు ధ్వంసమవుతున్నాయని అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల కారణంగా రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి.

– నర్సప్ప, బుద్లాపూర్

కేసులు నమోదు చేస్తాం



కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై వెళ్తున్నాయని మా దృష్టికి వస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తాం. కేజీవీల్స్‌కు తప్పని సరిగా పట్టీలు వేసుకోవాలి. నిబంధనలు పాటించని ట్రాక్టర్ల వివరాలు తమకు తెలియజేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– రవిగౌడ్, ఎస్ఐ, దోమ

నిబంధనలు పాటించాలి



రోడ్ల భద్రతపై గ్రామాల ప్రజలు దృష్టి సారించాలి. కేజ్‌వీల్స్‌కు పట్టీలు లేకుండా ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తున్నట్లు తమకు సమాచారం ఉంది. అలాంటి ట్రాక్టర్ యజమానులను గుర్తించి కేసులు నమోదు చేస్తాం. వాహనాలను సీజ్ చేస్తాం. ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించాలి.

– షాహెదబేగం, తహసీల్దార్, దోమ

గండి కొట్టి.. నీళ్లు మళ్లించి..

కావాలనే ధ్వంసం చేశారని ఫిర్యాదు

- దిగువకు చేపలు వెళ్లిపోయాయని ముదిరాజ్‌ల ఆవేదన



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

యాలాల: మండల కేంద్రంలోని మాచికుంట చెరువు కట్టకు కొందరు వ్యక్తులు గండి కొట్టి నీటిని మళ్లించారు. దీంతో నీరంతా వృథాగా దిగువకు పోయింది. ముదిరాజ్ సంఘం తరఫున చెరువులో వదిలిన చేపలు సైతం దిగువకు వెళ్లిపోయాయని సంఘం ప్రతినిధులు యాలాల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని చెరువులో ఎన్నో ఏళ్ల నుంచి ముదిరాజ్‌లు చేప పిల్లలు వదిలి లబ్ధి పొందుతున్నారు. కాగా చెరువు శిఖంలో పంచాయతీ పాలక వర్గం కొందరికి స్థలాలను కేటాయించడంతో ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు పూర్తి స్థాయిలో చేరింది. దీంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎగువన ఇళ్లలోకి నీరు వస్తుందనే భావనతో చెరువు కట్ట పక్క నుంచి గండి కొట్టి నీటిని దిగువకు వదిలారు. దీంతో నీరంతా దిగువకు వృథాగా పారింది. గతేడాది వదిలిన రెండువేల చేపలు సైతం ఖాళీ అయ్యాయి. చెరువుకు గండి కొట్టించిన శ్రీనివాస్, గఫూర్‌పై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ నాయకులు కోరారు. సోమవారం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో విచారణ జరిపి బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ అరవింద్‌కుమార్ తెలిపారు.



మాచికుంట చెరువు కట్టకు గండి కొట్టి నీటి మళ్లింపు

నేడు కేజీబీవీ భవన ప్రారంభోత్సవం

కొందుర్గు: మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభిస్తారని ఎంపీపీ పోతురాజు జంగయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అనంతరం మహదేవ్‌పూర్ శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం భూమిపూజ చేయనున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని వారు కోరారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకానికి ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఇబ్రహీంపట్నం మండల ఏపీఓ తిరుపతాచారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి(గట్ల వెంట మాత్రమే), డ్రాగన్ ఫ్రూట్(కేవలం అర ఎకరా మాత్రమే), సపోటా, ఆయిల్‌పామ్, బత్తాయి, అల్లనేరేడు పండ్ల తోటలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, ఐదు ఎకరాలలోపు పట్టాదారులు, ఉపాధి జాబ్ కార్డు, బోరు బావి, విద్యుత్ సౌకర్యం కలిగిన వారు అర్హులన్నారు. దరఖాస్తు ఫారంతోపాటుగా పట్టదారు పాసుబుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, పాన్ కార్డ్, ఉపాధి జాబ్ కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, గ్రామ పంచాయతీ తీర్మాన కాపీని జత చేయాలని సూచించారు. ఈ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శికి, ఏఈఓ, ఏపీఓలకు అందజేయాలన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని ఇస్లామిక్ సెంటర్‌లో అల్ ఖైర్ సొసైటీ ఆధ్వర్యంలో కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అన్నారు. విద్యార్థులు, యువకులు మంచి మంచి కోర్సులు నేర్చుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు హాది పటేల్, సొసైటీ వికారాబాద్ అధ్యక్షుడు అబ్దుల్ రావూఫ్, నాయకులు అబ్దుల్ నబూర్, గౌస్ పటేల్, ఫయాజుద్దీన్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మాజీ సభ్యుడు పాండు, నాయకులు గోపాల్, లక్ష్మారెడ్డి, ప్రశాంత్, విశ్వనాథం ఉన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సమస్యలు పరిష్కరించండి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మొయినాబాద్: పట్టణంలోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం యూనియన్ నాయకులు శంకర్‌పల్లి గురుకులాన్ని సందర్శించారు. మూడురోజుల క్రితం జరిగిన షాట్ సర్క్యూట్ ఘటనపై ప్రిన్సిపాల్, విద్యార్థులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు జైపాల్, కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు అశోక్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.